సాక్షి ఖమ్మం

సోమవారం । 23 । జనవరి । 2023



25 నుంచి స్వరరాగ ఝురి..

భద్రాద్రి రామయ్యకు అపర భక్తాగ్రేసరుడైన భక్త రామదాసు 390వ జయంతి ఉత్సవాలు ఈనెల 25న ప్రారంభం కానున్నాయి. 8లో



'ప్రేరణ' లేదు..

పదో తరగతి పరీక్షల్లో 100 శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ప్రేరణ పేరుతో ఏర్పాటుచేసిన ప్రత్యేక తరగతులు ఆశించిన మేర సాగడం లేదు. 10లో

గరిష్టం / కనిష్టం
31° / 17°

వాతావరణం

జిల్లాలో సోమవారం పగటి ఉష్ణోగ్రతలు సాధారణంగా ఉంటాయి. రాత్రి వేళ చలి ప్రభావం కనిపిస్తుంది.

న్యూస్‌రీల్

ప్రకృతి వనం పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్ తదితరులు

రఘునాథపాలెం: మండలంలోని వి.వెంకటాయపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ) ఆవరణలో బృహత్ పల్లెప్రకృతి వనం పనులను కలెక్టర్ వీ.పీ. గౌతమ్ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పనులు త్వరగా పూర్తిచేసి మొక్కలు నాటాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ విద్యాచందన, ఏపీఓ పద్మయ్య నాయుడు, ప్లాంటేషన్ సూపర్‌వైజర్లు సుస్మిత, విజయలక్ష్మి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అక్షరాస్యత పెంచేందుకే 'ఓపెన్'

- సార్వత్రిక విద్య జిల్లా కో ఆర్డినేటర్ పాపారావు



పుస్తకాలు పంపిణీ చేస్తున్న పాపారావు

కారేపల్లి: అక్షరాస్యతతో పాటు ఉన్నత విద్యావకాశాలను పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం ఓపెన్ స్కూల్ విధానాన్ని ప్రవేశపెట్టిందని, చదువు మానేసిన వారికి ఇది మంచి అవకాశమని ఓపెన్ స్కూల్ జిల్లా కోఆర్డినేటర్ మద్దినేని పాపారావు అన్నారు. కారేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఓపెన్ స్కూల్ తరగతులను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. రెగ్యులర్ విద్యా విధానంలో సర్టిఫికెట్లతో సమానంగా ఓపెన్ స్కూల్ సర్టిఫికెట్లకు విలువ ఉంటుందని తెలిపారు. ఉన్నత విద్య, ఉద్యోగాల్లో ప్రమోషన్లు, విజ్ఞాన సముపార్జనకు ఈ వ్యవస్థ ఎంతగానో దోహదపడుతుందని వివరించారు. పది, ఇంటర్, డిగ్రీ, పీజీ వరకు ఓపెన్ పద్ధతిలో చదువుకునే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎండీ నసీర్, తోటమల్ల సాయికుమార్, ముండ్ల సురేష్, యాకూబ్, అతీక్ తదితరులు పాల్గొన్నారు.

రామయ్యకు సువర్ణ పుష్పార్చన



కల్యాణ వేడుక నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామి వారి దేవస్థానంలో మూలమూర్తులకు ఆదివారం సందర్భంగా అభిషేకం, సువర్ణ పుష్పార్చన జరిపారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామి వారికి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవేత ధారణ, అమ్మ వారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. నిత్యకల్యాణంలో పాల్గొన్న భక్తులు స్వామి వారిని దర్శించుకుని ప్రసాదాలను స్వీకరించారు.

శ్రీకనకదుర్గమ్మ తల్లికి విశేష పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పాల్వంచరూరల్: శ్రీకనకదుర్గమ్మ తల్లికి ఆదివారం అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు క్యూలైన్ ద్వారా వెళ్లి అమ్మవారిని దర్శించుకున్నారు. తలనీలాలు సమర్పించారు. ఒడిబియ్యం, చీరలు, కుంకుమ, పసుపు, గాజులు అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించారు. అర్చకులు అమ్మవారికి అభిషేకం పూజలు జరిపారు. ఈఓ ఎస్.రజనీకుమారి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలకు రంగం సిద్ధం

- ఎస్‌జీటీలకు, ఎస్‌ఏలకు ప్రమోషన్లు
- సాకారం కానున్న ఏళ్లనాటి కల
- నేడు డీఈఓలతో ఉన్నతస్థాయి అధికారుల సమావేశం



నిరీక్షణకు తెర

సాక్షిప్రతినిధి, ఖమ్మం: పదోన్నతులు, బదిలీలకు విద్యాశాఖ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో జిల్లాలోని ఉపాధ్యాయుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ఈనెల 27 నుంచి ఈ ప్రక్రియ ప్రారంభించేందుకు కసరత్తు చేస్తున్నారు. రాష్ట్ర విద్యాశాఖ విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం పదోన్నతులు, బదిలీలు పూర్తి కానున్నాయి. ఏడున్నరేళ్లుగా ఉపాధ్యాయులు ప్రమోషన్ల కోసం ఎదురుచూస్తున్నారు. ఇక బదిలీలు చేపట్టక నాలుగున్నరేళ్లు కావస్తోంది. ఇదిలా ఉండగా ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 1,047 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటిలో కొన్నింటిని ఉద్యోగోన్నతుల ద్వారా భర్తీ చేయనున్నారు.

ఎస్‌జీటీలు, స్కూల్ అసిస్టెంట్లకు..

ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన నేపథ్యంలో ఎస్‌జీటీలు స్కూల్ అసిస్టెంట్లుగా, స్కూల్ అసిస్టెంట్లు హెచ్‌ఎంలు ఉద్యోగోన్నతి పొందనున్నారు. ఇందుకు సంబంధించిన ప్రక్రియ జరుగుతున్నట్లు తెలుస్తోంది. సీనియర్ ఎస్‌జీటీలు తమ ఇష్టం మేరకు ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎంలుగా వెళ్లొచ్చు. ఇక 81 గ్రేడ్–2 హెచ్‌ఎం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ పోస్టులను ఎస్‌ఏలతో భర్తీ చేయనున్నారు. స్కూల్ అసిస్టెంట్లలో మ్యాథ్స్, ఫిజిక్స్, బయాలజీ, ఇంగ్లిష్, సోషల్, తెలుగు, హిందీ సబ్జెక్టులకు కలిపి 485 ఖాళీలున్నాయి. వీటితోపాటు ఉద్యోగోన్నతి పొందే 81 మందితో కలిపి మొత్తం 566 ఖాళీలు ఏర్పడతాయి. ఈ ఖాళీలను ఎస్‌జీటీలకు ఉద్యోగోన్నతి కల్పించడం ద్వారా భర్తీ చేయనున్నారు. ఎస్‌జీటీ తెలుగు 342, ఎస్‌జీటీ ఉర్దూలో 12 ఖాళీలున్నాయి. వీటితోపాటు 566 మందికి ఉద్యోగోన్నతి లభిస్తే ఎస్‌జీటీల్లో మొత్తం 920 ఖాళీలు ఏర్పడతాయి.

హెచ్‌ఎంల పరిస్థితేంటో..

ప్రధానోపాధ్యాయులకు సంబంధించి ఇంకా స్పష్టత రాలేదు. ఉద్యోగోన్నతుల్లో భాగంగా ప్రధానోపాధ్యాయులకు డైట్ కళాశాలల్లో లెక్చరర్లుగా, జూనియర్ కళాశాలల్లో ప్రిన్సిపాళ్లుగా అవకాశం కల్పిస్తారు. అయితే ఈసారి ప్రధానోపాధ్యాయుల ప్రమోషన్లపై మార్గదర్శకాలు రాలేదు. ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల ప్రక్రియకు సంబంధించిన షెడ్యూల్ వస్తేనే పూర్తిస్థాయిలో స్పష్టత రానుంది. అలాగే సోమవారం డీఈఓలతో హైదరాబాద్‌లో ఉన్నతస్థాయి అధికారుల సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో బదిలీలు, ఉద్యోగోన్నతులపై చర్చ జరిగే అవకాశం ఉంది. ఏది ఏమైనప్పటికీ విద్యాశాఖ నుంచి మార్గదర్శకాలు వస్తేనే ప్రక్రియపై స్పష్టత వస్తుంది.

సుదీర్ఘకాలం తర్వాత..

ఎట్టకేలకు ఉపాధ్యాయులకు బదిలీలతోపాటు పదోన్నతులు లభించబోతున్నాయి. 2015 నుంచి ఉపాధ్యాయులకు ఉద్యోగోన్నతులు లేవు. 2018 నుంచి బదిలీల ప్రక్రియ చేపట్టలేదు. ప్రస్తుతం ఈ ప్రక్రియకు ముందడుగు పడింది. అయితే సీనియారిటీని ఎలా లెక్కిస్తారు.. ఏ ప్రాతిపదికన ప్రమోషన్లు కల్పిస్తారు అనే అంశంపై ఉపాధ్యాయుల్లో ఉత్కంఠ నెలకొంది. ప్రభుత్వం విడుదల చేసే మార్గదర్శకాలతో ఈ సందేహాలు నివృత్తి కానున్నాయి. విద్యాశాఖ పేర్కొన్న ప్రకారం ఉద్యోగోన్నతుల ప్రక్రియ పూర్తయితే ఎస్‌జీటీల ఖాళీలు మరిన్ని పెరగనున్నాయి.

మొత్తం ఉపాధ్యాయ పోస్టులు	ప్రస్తుతం పనిచేస్తున్న ఉపాధ్యాయులు	ఖాళీగా ఉన్న పోస్టులు
5,759	4,712	1,047

సీనియారిటీ జాబితా సిద్ధం చేస్తున్నాం



జిల్లాలో ఇప్పటికే టీచర్ల బదిలీలకు సంబంధించిన ఖాళీల వివరాల లెక్క తేల్చాం. సోమవారం(నేడు) మాకు ఉన్నతాధికారులతో హైదరాబాద్‌లో సమావేశం ఉంది. వారిచ్చే ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ వి.పి.గౌతమ్ ఆధ్వర్యంలో పదోన్నతులు, బదిలీల ప్రక్రియను ప్రారంభిస్తాం. ఇప్పటివరకు అధికారికంగా బదిలీలు, పదోన్నతులకు సంబంధించిన ఉత్తర్వులు అందలేదు. ఇప్పుడు వస్తున్న సమాచారం ప్రకారం సీనియారిటీ జాబితాను సిద్ధం చేస్తున్నాం.

– సోమశేఖరశర్మ, డీఈఓ

రాష్ట్రానికే ఆదర్శంగా ఖమ్మం

- నగరంలో 75 ఏళ్లలో లేని అభివృద్ధి ఏడేళ్లలో జరిగింది
- కేసీఆర్, కేటీఆర్ సహకారంతోనే సాధ్యమైంది
- మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్



సెంట్రల్ లైటింగ్‌ను ప్రారంభిస్తున్న మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మంలో 75 ఏళ్లలో జరగని అభివృద్ధి ఏడేళ్లలోనే సాధ్యమైందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. నగరంలో ఇప్పటివరకు జరిగిన అభివృద్ధి యావత్ రాష్ట్రానికే ఆదర్శమని చెప్పారు. ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని 58వ డివిజన్ రాపర్తినగర్ సెంటర్ నుంచి టీఎన్జీవోస్ కాలనీ వరకు రూ.2.28 కోట్లతో నిర్మించిన సెంట్రల్ డివైడర్, సెంట్రల్ లైటింగ్ పనులను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎనిమిదేళ్లలో ఖమ్మం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలు విడుదల చేసిందన్నారు. నగరాభివృద్ధిలో భాగస్వామినై ఖమ్మాన్ని టైర్ సిటీస్ వరుసలో నిలపాలని దృఢంగా సంకల్పించుకున్నానని, అది నేడు ఆచరణలో చూపించగలిగామని అన్నారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ సహకారంతో నేడు ఖమ్మం రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలవడం గర్వకారణమన్నారు. గతంలో వేసవి వస్తే నగరంలో కరెంట్ ఉండేది కాదని, ఇప్పుడు రెప్పపాటున కూడా పోవడం లేదని గుర్తు చేశారు. ఇప్పుడు అపార్ట్‌మెంట్లలో జనరేటర్లు, ఇళ్లలో ఇన్వెర్టర్ల అవసరమే లేకుండా పోయిందన్నారు. గత ప్రభుత్వాలు పరిశ్రమలకు పవర్ హాలిడే ఇచ్చేవని, ఇప్పుడలాంటివేమీ లేవని తెలిపారు. ఇంకా రోడ్లు, శ్మశానవాటిక వంటి సమస్యలను సైతం పరిష్కరించామని చెప్పారు. పిల్లలకు ఆహ్లాదం కోసం ప్రతి డివిజన్‌లో పార్కులు, ఓపెన్ జిమ్‌లు, పబ్లిక్ టాయిలెట్లు, తాగునీరు అందుబాటులోకి తీసుకొచ్చామని, ఖమ్మం ప్రజల అవసరాలు, అభివృద్ధి పనులకు ప్రభుత్వం రూ.1,800 కోట్లు ఇచ్చిందని వివరించారు. నగరపాలక సంస్థ పరిధిలో ఎక్కడ చిన్న సమస్య వచ్చినా తక్షణమే స్పందించి పరిష్కరించుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభి, మేయర్ పునుకొల్లు నీరజ, కార్పొరేటర్ దొరేపల్లి శ్వేత, సుడా చైర్మన్ విజయ్, పబ్లిక్ హెల్త్ ఈఈ రంజిత్, డీఈ రంగారావు, నాయకులు ఊట్కూరి రవికాంత్, మహేష్, శ్రీనివాస రావు, నాగమణి, మాధవి, సోమయ్య, విశ్వనాథ చారి, పైడిపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్ పనుల పరిశీలన

నగరంలోని వీడీవోస్ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న వెజ్ అండ్ నాన్‌వెజ్ సమీకృత మార్కెట్ పనులను మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఆదివారం రాత్రి పరిశీలించారు. మార్కెట్ నిర్మాణ పనులు ముగింపు దశకు చేరుకోవడంతో అధికారులకు పలు సూచనలు చేశారు.

ఎమ్మెల్సీ కుటుంబానికి పరామర్శ



నిఖిల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి

తిరుమలాయపాలెం: ఎమ్మెల్సీ, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తాత మధుసూదన్ సోదరుడు విశ్వేశ్వరరావు కుమారుడు నిఖిల్ బెంగళూరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇటీవల మృతిచెందగా రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఆదివారం పిండిప్రోలులో ఆయన కుటుంబసభ్యులను పరామర్శించారు. మంత్రితో పాటు ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజ్, సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్ నిఖిల్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ నాగండ్ల కోటి, నాయకులు ముత్యాల వెంకటప్పారావు, పైడిపల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఏఈఈ పరీక్ష ప్రశాంతం

కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్, అదనపు కలెక్టర్



పరీక్షను తనిఖీ చేస్తున్న కలెక్టర్ గౌతమ్



ఎస్‌ఆర్‌అండ్ బీజీఎన్‌ఆర్ పరీక్ష కేంద్రంలో నంబర్లు చూసుకుంటున్న అభ్యర్థులు



పరీక్ష రాసేందుకు వస్తున్న అభ్యర్థులు

ఖమ్మం సహకారనగర్: టీఎస్‌పీఎస్సీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఏఈఈ) పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు సంబంధించి ఖమ్మం నగరంతో పాటు సమీపంలో 19 కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 6,664 మంది అభ్యర్థులకు గాను ఉదయం పరీక్షకు 5,194 మంది హాజరు కాగా 1470 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం పరీక్షకు 6,664 మందికి గాను 5,166 మంది హాజరు కాగా 1498 మంది గైర్హాజరయ్యారు.

నిమిషం నిబంధన అమలు..

పరీక్ష కేంద్రాల్లో నిమిషం నిబంధనను అధికారులు పటిష్టంగా అమలు చేశారు. ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల కేంద్రంలో ఓ అభ్యర్థిని ఐదు నిమిషాలు ఆలస్యంగా రాగా వెనక్కు పంపించారు. పలు కేంద్రాలకు చివరి నిమిషాల్లో అభ్యర్థులు ఉరుకులు, పరుగుల మీద చేరుకున్నారు. కొద్ది మంది చంటి పిల్లలతో రాగా.. పలువురు గర్భిణులు సైతం పరీక్షకు హాజరయ్యారు.

కలెక్టర్, అదనపు కలెక్టర్ తనిఖీ..

నగరంలోని ఎస్‌ఆర్ అండ్ బీజీఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ వీపీ గౌతమ్, అదనపు కలెక్టర్ ఎన్.మధుసూదన్ పరిశీలించారు. కార్యక్రమంలో లైజనింగ్ అధికారులు కారుమంచి శ్రీనివాసరావు, రవిబాబు, అసిస్టెంట్ లైజనింగ్ అధికారులు కరుణ, కృష్ణ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన బాలోత్సవ్

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం క్లబ్‌లో శనివారం ప్రారంభమైన బాలోత్సవ్ ఆదివారం ముగిసింది. పోటీలకు జిల్లావ్యాప్తంగా 80 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి 8,9,10 తరగతుల విద్యార్థులు 235 మంది హాజరయ్యారు. బాలోత్సవ్ చిల్డ్రన్ కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కథా, కవితా రచనల వర్క్‌షాపులో ప్రతిభ చూపారు. పలువురు కవులు, కథకులు చిన్నారులకు కథ, కవితా రచనపై కార్యశాలలో అవగాహన కల్పించారు. ముగింపు వేడుకలకు డాక్టర్ రమేష్‌బాబు, డాక్టర్ నాగరాజు హాజరై మాట్లాడారు. రచయితల సలహాలు సూచనలు తీసుకుని రచనలపై దృష్టి సారించాలని చిన్నారులకు సూచించారు.

విజేతలు వీరే..

కథల పోటీలో పాల్వంచ డీఏవీ మోడల్ పాఠశాల 8వ తరగతి విద్యార్థి బి.ఫణీంద్ర ప్రథమ బహుమతిని గెలుచుకున్నారు. తల్లాడ బాలభారతి పాఠశాల 9వ తరగతి విద్యార్థి టి.అజయ్ ద్వితీయ బహుమతి, పాల్వంచ సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాల 9వ తరగతి విద్యార్థి ఎస్.సింధు తృతీయ బహుమతిని పొందారు. కవితా రచన పోటీల్లో కొత్తగూడెం కేఎస్‌ఆర్ పాఠశాల పదో తరగతి విద్యార్థి హెచ్.అఖిల్ ప్రథమ బహుమతి, పాల్వంచ డీఏవీ మోడల్ పాఠశాల విద్యార్థి జనిత్‌రోజ్ ద్వితీయ బహుమతి, కొత్తగూడెం సెయింట్ మేరీస్ హైస్కూల్ విద్యార్థి కె.మేరి తపస్వి తృతీయ బహుమతిని కైవసం చేసుకున్నారు. విజేతలకు డాక్టర్ రమేష్‌బాబు, డాక్టర్‌నాగరాజు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రచయితలు, కవులు అనిల్ డ్యాలీ, కటుకోజ్వల రమేష్, భగవంత, శీరంశెట్టి కాంతారావు, మధుసూదన్ పాల్గొన్నారు.

వికృత చేష్టలు పెరుగుతున్నాయి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అంపశయ్య నవీన్ తదితరులు

- నవలా రచయిత అంపశయ్య నవీన్
- 'సదువు చెబుతవ సారూ..' పుస్తకావిష్కరణ

ఖమ్మంగాంధీచౌక్: సమాజంలో వికృత చేష్టలు పెరుగుతున్నాయని ప్రముఖ నవలా రచయిత, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత అంపశయ్య నవీన్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం వైబోయిన సత్యనారాయణ రచించిన 'సదువు చెబుతవ సారూ..' పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం కవి సీహెచ్ ఆంజనేయులు అధ్యక్షతన జరిగిన సమావేశంలో నవీన్ మాట్లాడుతూ.. సాహిత్యం విస్తృతంగా రాకపోవడంతో సమాజం గతి తప్పుతోందని, పఠనా శక్తి తగ్గడంతో వికృత, సంస్కార రహిత పనులు సాగుతున్నాయని అన్నారు. సమాజంలో హింసా ప్రవృత్తి హద్దుమీరుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. గిరిజన సంస్కృతికి సంబంధించిన మరికొన్ని పుస్తకాలను ఆవిష్కరించాలని సత్యనారాయణకు సూచించారు. కార్యక్రమంలో సంఘం అరసం రాష్ట్ర కార్యదర్శి పల్లేరు వీరస్వామి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నిధి, సీపీఐ నాయకులు బాగం హేమంతరావు, పోటు ప్రసాద్, సాహితీవేత్తలు ముక్క సురేష్, ఉప్పల శ్రీనివాస్‌రావు, ఏనుగు వెంకటేశ్వరరావు, ప్రజా నాట్యమండలి కళాకారులు వై.వెంకటేశ్వరరావు, దాసరి రాము, ఆంజనేయులు, హేతువాద సంఘం నాయకులు కన్నెబోయిన అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

చి'వరి' దశలో కొనుగోళ్లు

- ఇప్పటివరకు 2.52లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ
- రైతులకు చెల్లించిన నగదు రూ.391 కోట్లకు పైగానే..
- మొదట నెమ్మదిగా సాగినా, ఆ తర్వాత పుంజుకున్న వేగం
- ఈ నెలాఖరులోగా పూర్తిచేసేలా కసరత్తు



కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)



కేంద్రంలో ధాన్యం కాంటా వేస్తున్న దృశ్యం (ఫైల్)

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో పౌరసరఫరాల శాఖ ద్వారా వానాకాలం సీజన్ ధాన్యం కొనుగోళ్లు ముగింపు దశకు చేరుకుంటున్నాయి. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసేందుకు జిల్లాలో 233 కేంద్రాలను ఏర్పాటు చేశారు. అయితే 221 కేంద్రాలకు మాత్రమే ధాన్యం విక్రయానికి వచ్చింది. కాగా ఇటీవల ధాన్యంరావడం నిలిచిపోయిన సెంటర్లలో రోజుకు కొన్ని చొప్పున ఇప్పటి వరకు 193 కొనుగోలు కేంద్రాలను మూసేశారు. జిల్లాలోని 21 మండలాల పరిధిలో 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించగా ఇప్పటివరకు 2,52,279 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. 'ఏ' గ్రేడ్ రకం క్వింటాకు రూ.2,060, కామన్ రకానికి రూ.2,040గా ధర నిర్ణయించారు.

తొలుత నిదానం .. ఆ తర్వాత ముమ్మరం

జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు తెరిచిన సమయంలో అనేక సెంటర్లకు ధాన్యం అమ్మకానికి రాలేదు. తొలి రోజుల్లో అకాల వర్షాలతో ధాన్యంలో తేమ ఎక్కువగా ఉండడంతో కొనుగోళ్లు మందకొడిగా సాగాయి. దీంతో పాటు బహిరంగ మార్కెట్‌లో ధర అధికంగా ఉండడంతో రైతులు ప్రైవేట్ వ్యాపారులకు విక్రయించేందుకే మొగ్గు చూపారు. దీంతో కలెక్టర్ వీ.పీ.గౌతమ్ అధికారులను అప్రమత్తం చేశారు. ఆ తర్వాత ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రాధాన్యతను వివరిస్తూ ఆయా శాఖాధికారులు క్షేత్రస్థాయిలో కొనుగోళ్లపై మరింత దృష్టి సారించారు.

కొనుగోళ్లు.. చెల్లింపులిలా..

జిల్లాలో 221 కొనుగోలు కేంద్రాల నుంచి 2,52,279.320 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని నుంచి కొనుగోలు చేశారు. ఇందులో గ్రేడ్–ఏ రకం 68,195.880 మెట్రిక్ టన్నులు, కామన్ రకం 1,84,083.320 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశారు. మొత్తం 36,830 మంది రైతుల నుంచి ధాన్యం సేకరించారు. వారికి రూ.516,01,34,856 చెల్లించాల్సి ఉండగా ఇప్పటివరకు 28,942 మంది రైతులకు రూ.391,76,77,872 చెల్లించారు. ఇంకా 7,888 మంది రైతులకు రూ.124,24,56,984 ఇవ్వాల్సి ఉంది.

గడువు మరో వారమే..

జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు వారం రోజుల్లో ముగిసే అవకాశం ఉంది. 233 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగా.. ధాన్యం అమ్మకానికి రాకపోవడంతో 193 కేంద్రాలను ఇప్పటికే మూసివేశారు. మిగతా కేంద్రాలను సైతం రోజుకు కొన్ని చొప్పున మూసేస్తున్నారు. ఇక కొద్ది మొత్తంలో ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉండగా, వాటిని కూడా త్వరలో పూర్తి చేసేందుకు అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది.

కొనుగోళ్ల వివరాలిలా

మొత్తం కొనుకోలు కేంద్రాలు	233
రైతులు	36,830 మంది
గ్రేడ్–ఏ	68,195.880 మెట్రిక్ టన్నులు
కామన్ రకం	1,84,083.320 మెట్రిక్ టన్నులు
మొత్తం ధాన్యం	2,52,279.200 మెట్రిక్ టన్నులు
గ్రేడ్ 'ఏ' రకం ధర క్వింటాకు	రూ.2,060
కామన్ రకం ధర క్వింటాకు	రూ.2,040
ఇప్పటి వరకు చెల్లించిన మొత్తం	రూ. 391,76,77,872

30లోగా ముగిస్తాం



జిల్లాలో పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ ఈనెల 30వ తేదీతో ముగించాలని నిర్ణయించాం. 221 కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు 2,52,279.200 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశాం. కొన్ని కేంద్రాల్లో ధాన్యం ఉండగా, తక్షణమే కొనుగోలు చేయడంతో పాటు మిల్లుల తరలింపు ప్రక్రియ అంతా ఈ నెల 30 నాటికి పూర్తి చేస్తాం.

– ఎస్.మధుసూదన్, జిల్లా అదనపు కలెక్టర్

క్లుప్తంగా

వైరాలో గంజాయి పట్టివేత



నిందితుడిని చూపుతున్న ఎక్సైజ్ అధికారులు

వైరా: అక్రమంగా గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని ఎక్సైజ్, ప్రొహిబిషన్ అధికారులు ఆదివారం పట్టుకున్నారు. వైరా ఎక్సైజ్ సీఐ రమ్యారెడ్డి కథనం ప్రకారం.. కొణిజర్ల మండలం గద్దలగూడెం గ్రామానికి చెందిన తమ్మిశెట్టి ఆనంద్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డొంకరాయి నుంచి గంజాయి తీసుకొచ్చి వైరా చుట్టుపక్కల విక్రయిస్తున్నాడనే సమాచారం లభించడంతో ఎక్సైజ్, ప్రొహిబిషన్ జిల్లా అధికారి జి.నాగేంద్ర రెడ్డి ఆదేశాల మేరకు ఎక్సైజ్ సిబ్బంది సదరు వ్యక్తిని పట్టుకుని అతని వద్ద నుంచి 7 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. దాడిలో సిబ్బంది ఆర్.కిరీటి, మమత, నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు, రవికుమార్, సీతారామ్, శ్రావణ్‌కుమార్, నాగేంద్రమ్మ పాల్గొన్నారు.

కారేపల్లి క్రాస్‌రోడ్డులోని బస్టాండ్ కూల్చివేత

– పోలీసులకు ఖమ్మం ఆర్టీసీ డీఎం ఫిర్యాదు

కారేపల్లి: కారేపల్లి క్రాస్‌రోడ్డులో ఆర్టీసీ ఆధ్వర్యంలో నిర్మించిన బస్టాండ్‌ను కొందరు వ్యక్తులు జేసీబీలతో కూల్చివేసిన ఘటనపై ఖమ్మం డిపో మేనేజర్ శ్రీనివాసరావు పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. కారేపల్లి క్రాస్‌రోడ్డులో ఖమ్మం–ఇల్లెందు ప్రధాన రహదారి పక్కన 1999లో సంగబత్తుల వీరారెడ్డి ఎకరం భూమిని ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణానికి విరాళమిచ్చాడు. ఆ స్థలంలో ఆర్టీసీ యాజమాన్యం బస్టాండ్ నిర్మించింది. కాలక్రమేణా బస్సులను బస్టాండ్‌లో నిలపకపోవడంతో సుమారు 20 ఏళ్ల నుంచి నిరుపయోగంగా మారింది. దీనిని కొంతమంది వ్యక్తులు ఆసరాగా చేసుకొని ఈ నెల 14వ తేదీన జేసీబీలతో బస్టాండ్‌ను నేలమట్టం చేశారు. పునాదులు సైతం కనబడకుండా మొరంతో కప్పివేశారు. విషయం తెలుసుకున్న ఖమ్మం డిపో మేనేజర్ శ్రీనివాసరావు కారేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ పుష్పాల రామారావు దర్యాప్తు చేపట్టారు. కామేపల్లి మండలం ఊట్కూరు గ్రామానికి చెందిన ఏపూరి రవి ఈ ఘటనకు బాధ్యుడని తేలడంతో అతడిపై కేసు నమోదు చేశారు.

నేడు ఇల్లెందుకు కేంద్ర మంత్రి రాక

ఇల్లెందు: కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరును, బీజేపీ పటిష్టత కోసం బూత్ కమిటీ సభ్యులతో చర్చించేందుకు కేంద్ర ఈశాన్య ప్రాంత అభివృద్ధి శాఖ, సహకార శాఖ సహాయ మంత్రి బీ.ఎల్. వర్మ ఇల్లెందుకు రానున్నారని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి జి.రాంచందర్ నాయక్, నియోజకవర్గ కన్వీనర్ బలగానీ గోపీకృష్ణ తెలిపారు. ఆదివారం పట్టణ బీజేపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం సాగిస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు, కేంద్ర ప్రభుత్వం విడుదల చేస్తున్న నిధులను దారి మళ్లిస్తున్న తీరును వివరించేందుకు నిర్వహించే ఈ సభలను ప్రజలు కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సభకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శృతి, జిల్లా ఇన్‌చార్జ్ రాకేష్‌రెడ్డి, ప్రభారీ రాజ్యవర్ధన్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు కోనేరు సత్యనారాయణలు హాజరవుతున్నట్లు తెలిపారు.

పేకాట స్థావరాలపై దాడి

కారేపల్లి: పేకాట స్థావరాలపై కారేపల్లి పోలీసులు దాడి చేసి ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నారు. ఆదివారం చోటుచేసుకున్న ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని ఉసిరికాయలపల్లి గ్రామ సమీపంలోని శ్మశాన వాటిక ప్రదేశంలో కొంతమంది పేకాట ఆడుతున్నారని పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో కారేపల్లి ఎస్‌ఐ పుష్పాల రామారావు ఆధ్వర్యంలో సిబ్బంది చాకచక్యంగా పేకాట స్థావరాలపై దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న లకావత్ రత్న, ఎల్లబోయిన ప్రేమ్, బోడ సుధాకర్, గుగులోతు కిరణ్, బోడ సాయి, లకావత్ సుందర్, మూడ్ వీరన్న, గుగులోతు దస్రులను అదుపులోకి తీసుకుని వారిపై కేసు నమోదు చేశారు. వారి వద్ద నుంచి రూ.10,300 నగదు స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ రామారావు తెలిపారు. దాడిలో కానిస్టేబుళ్లు సుధాకర్, వెంకన్న, శంకర్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

లారీ చోరీ..

ఖమ్మంరూరల్: మండలంలోని నాయుడుపేటలో గల ఓ పెట్రోల్ బంక్‌లో పార్క్ చేసిన లారీని గుర్తుతెలియని దుండగులు అపహరించిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గుదిమళ్లకు చెందిన తమ్మిశెట్టి రామరాజు లారీడ్రైవర్, ఓనర్ కిరాయికి వెళ్లి శనివారం రాత్రి లారీని బంక్‌లో ఉంచి ఇంటికి వెళ్లాడు. అనంతరం తిరిగి వచ్చి చూసే సరికి లారీ కనిపించలేదు. ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు లారీని ఎత్తుకెళ్లినట్లు గుర్తించాడు. రామరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకటకృష్ణ తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,881

25 నుంచి స్వరరాగ ఝరి..



చిత్రకూట మండపంలో జరుగుతున్న వాగ్గేయకారోత్సవాలు (ఫైల్)

- భక్త రామదాసుకు స్వర నీరాజనం
- ఐదు రోజుల పాటు కొనసాగనున్న వాగ్గేయకారోత్సవాలు
- పలు రాష్ట్రాల నుంచి తరలిరానున్న సంగీత కళాకారులు

భద్రాచలం: భద్రాద్రి రామయ్యకు అపర భక్తాగ్రేసరుడు, భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం నిర్మాణ కర్త అయిన భక్త రామదాసు 390వ జయంతి ఉత్సవాలకు భద్రాచలం వేదిక కానుంది. రాముడిపై భక్తితో ఆలయాన్ని నిర్మించడమే కాక అనేక కీర్తనలను స్వయంగా రచించి ఆలపించిన ఘనత భక్త రామదాసుది. అంతటి మహనీయుడికి స్మృతిగా శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో ప్రతి ఏడాది వాగ్గేయ కారోత్సవాలను ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అయితే గత రెండు సంవత్సరాలు కోవిడ్ ప్రభావంతో నిరాడంబరంగా జరిపిన ఈ వేడుకలను ఈ ఏడాది ఎలాంటి ఆంక్షలు లేకపోవడంతో జయంతి ఉత్సవాలను ఈ నెల 25 నుంచి 29 వరకు వైభవోపేతంగా నిర్వహించాలని ఆలయ అధికారులు నిర్ణయించారు. ఈ క్రమంలో పలు పట్టణాలు, రాష్ట్రాల నుంచి వివిధ సంగీత కళాకారులతో సాంస్కృతిక ప్రదర్శనల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించారు. ఈ ఐదు రోజులు భద్రాచలం 'స్వరరాగ ఝరి'లో ఓలలాడనుంది.

అలరించనున్న నవరత్న ఘోష్ఠి..

భక్త రామదాసు జయంతి సందర్భంగా వాగ్గేయకారోత్సవాలను వైభవంగా నిర్వహించడం, వివిధ రాష్ట్రాల నుంచి ప్రముఖ సంగీత కళాకారులను భద్రాచలానికి తీసుకొచ్చి రామయ్య సన్నిధిలో ప్రదర్శనలు ఇప్పించడంలో చక్ర సిమెంట్స్ అధినేత నేంద్రగంటి కృష్ణమోహన్‌ది కీలక పాత్ర. ఆయన నేతృత్వంలో నేంద్రగంటి అలివేలు మంగ సర్వయ్య చారిటబుల్ ట్రస్ట్ పేరిట హైదరాబాద్, బెంగళూర్, చెన్నై, విజయవాడ నుంచి వచ్చిన సంగీత విద్వాంసులు ఆలపించే 'నవరత్న ఘోష్ఠి' అలరిస్తుంది. ఈ మధురిమలను వినాలంటే వాగ్గేయకారోత్సవాలు జరిగే చిత్రకూట మండపానికి రావాల్సిందే. ఈ జయంతి ఉత్సవాల్లో ప్రఖ్యాత సంగీత విద్వాంసులు మల్లాది సూరిబాబు, అతని కుమారులు మల్లాది శ్రీరామ్‌కుమార్, రవికుమార్‌తో పాటు పలువురు విద్వాంసులు పాల్గొననున్నారు.

ఆద్యంతం ఆకట్టుకునేలా..

ఈనెల 25 నుంచి 29 వరకు చిత్రకూట మండపంలో వాగ్గేయకారోత్సవాలు ఆద్యంతం ఆకట్టుకునేలా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. 25న నగర సంకీర్తన, రామదాసు విగ్రహానికి అభిషేకం అనంతరం ఆలయ ఈఓ శివాజీ ఉత్సవాలను ప్రారంభిస్తారు.

నవరత్న కీర్తనల ఘోష్ఠితో పాటు మల్లాది రవికుమార్ రచించిన ఆదిభట్ల నారాయణదాసు కీర్తనల పుస్తకావిష్కరణ, వివిధ సంగీత విద్వాంసుల ప్రదర్శనలు ఉంటాయి. 26న దేవస్థాన నాదస్వర, భజన బృందం, అమెరికాకు చెందిన విజ్జి సోమనాథ్, తెలుగు యూనివర్సిటీ బృందం, నేంద్రగంటి కృష్ణమోహన్‌తో పాటుగా ఇతరులు ప్రదర్శనలు ఇవ్వనున్నారు. 27న చెన్నై, హైదరాబాద్, విజయవాడకు చెందిన కళాకారులచే, 28, 29 తేదీల్లో హైదరాబాద్‌కు చెందిన బృందాలచే శాస్త్రీయ సంగీత కార్యక్రమాలు ఉంటాయి.

అలరించిన 'ప్రేమతో నాన్న'



ప్రేమతో నాన్న నాటికలో సన్నివేశం

ఖమ్మంగాంధీచౌక్: నెల నెలా వెన్నెలా.. కార్యక్రమంలో భాగంగా వేసిన ప్రేమతో నాన్న నాటిక ఆహూతులను అలరించింది. ఆదివారం రాత్రి ఖమ్మం నగరంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో అమరజీవి అన్నాబత్తుల రవీంద్రనాథ్ కళా సాంస్కృతిక సంస్థ (ఆర్క్స్) నిర్వహించిన ఈ సాంస్కృతిక కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీఎస్ఎన్ఎల్ (ఈయూ) ఆలిండియా జనరల్ సెక్రటరీ జూలపల్లి సంపత్‌రావు హాజరయ్యారు. ఆయనతోపాటు ఖమ్మం నగర ఏసీపీ ఆంజనేయులు, దాతలు, ఆత్మీయ అతిథులు పెనుగొండ శ్రీనివాసరావు, మారిగంటి తిరుమలాచార్యులు తదితరులు పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో తొలుత తెలంగాణ తొలితరం ఉద్యమకారుడు అన్నాబత్తుల రవీంద్రనాథ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి జూలపల్లి సంపత్‌రావు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమించిన రవీంద్రనాథ్ పేరిట సాంస్కృతిక సంస్థ ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. ఈ సాంస్కృతిక సంస్థ నేటి పరిస్థితులకు అనుగుణంగా సామాజిక కార్యక్రమాలను సాంస్కృతిక రూపాల్లో ప్రదర్శనలు, నాటికలను ప్రతి నెలా ప్రదర్శించటం హర్షణీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాలు సమాజ అభ్యున్నతికి దోహదపడతాయని తెలిపారు. ఈ సందర్భంగా దీకొండ చంద్రమౌళి రచించిన 'శ్రీమద్రామాయణం'తత్వదర్శిని పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం రచయిత దంపతులను కార్యక్రమ నిర్వాహకులు సన్మానించారు. అనంతరం వైష్ణవి నృత్య ప్రదర్శన అలరించింది. కొలకలూరుకు చెందిన కళాకారులు ప్రదర్శించిన 'ప్రేమతో నాన్న'నాటిక ప్రేక్షకులను ఆకట్టుకుంది. విజయఆర్కే రచించిన ఈ నాటికను రావి నాగేశ్వరరావు నాటకీకరించారు. నాటికకు గోపరాజు విజయ్ దర్శకత్వం వహించారు. కార్యక్రమంలో ఆర్క్స్ సంస్థ నిర్వాహకులు ఏఎస్‌కుమార్, మోటమర్రి జగన్మోహన్‌రావు, డాక్టర్ నాగబత్తిని రవి, కె.దేవేంద్ర, వేముల సదానందం, నామా లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

హీటెక్కిన ఇల్లెందు

- నేడు పోటాపోటీగా ఆత్మీయ సమ్మేళనాలు
- ఒకరి సభకు మరొకరు వెళ్లకుండా ప్రణాళిక
- అనుచరులను కాపాడుకునేందుకు పక్కా ప్లాన్



లలితాపురం తోటలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య బృందం

ఇల్లెందు: ఇల్లెందు రాజకీయం హీటెక్కుతోంది. పోటాపోటీగా ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తున్నారు. మూడు రోజుల ముందే ఒక ఆత్మీయ సమ్మేళనం తేదీ ఖరారు కాగా మరో ఆత్మీయ సమ్మేళనం ఒక్క రోజులోనే రాత్రికి రాత్రే ఖరారు అయ్యింది. ఒకరు తమ అభిమానులను కూడబెట్టుకునేందుకు ఏర్పాటు చేసుకుంటే, మరొకరు సభకు వెళ్లకుండా అడ్డుకునేందుకు ఏర్పాటు చేసుకున్నారనే చర్చ స్థానికంగా జరుగుతోంది. నిన్నటి వరకు ఒకే పార్టీలో ఉన్న వారు రేపటి నుంచి మరోలా మారబోతున్నారు. నూతన సంవత్సరం సందర్భంగా మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డిలు ఏర్పాటు చేసిన శుభాకాంక్షల సభలే రాజకీయాలను హీటెక్కించాయి. ఆ వెనువెంటనే సీఎం కేసీఆర్ అటు భద్రాద్రికొత్తగూడెం, ఇటు ఖమ్మంలో పర్యటించిన సందర్భంగా కూడా పొంగులేటి, జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్యలు పాల్గొనలేదు. కాగా, మంత్రులు హరీష్‌రావు, అజయ్‌కుమార్‌లు ఇల్లెందు సభలో అటు పొంగులేటిని, ఇటు కోరంను పరోక్షంగా విమర్శించిన తీరు చూస్తే వారికి ఆ పార్టీతో దూరం పెరిగిందని తేలిపోయింది. ఇప్పటికే పినపాకలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సోమవారం 23న ఇల్లెందులో 'ఆత్మీయ సమ్మేళనం' ఏర్పాటు చేశారు. దీంతో వారు ఏ పార్టీలోకి వెళ్లాలనే విషయంపై పార్టీ కార్యకర్తలు, అభిమానుల నుంచి 'ఫీడ్ బ్యాక్' తీసుకునే అవకాశం ఉంది. ఏది ఏమైనా కోరం, పొంగులేటి శ్రీనివాసరెడ్డి పయనం ఎటు ఉంటుందనే అంశం కార్యకర్తలు, నేతలకు అంతుచిక్కడం లేదు.

బీట్ మార్కెట్‌లో అధికార ఎమ్మెల్యే బృందం

మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, ఎమ్మెల్యే హరిప్రియ, మార్కెట్ కమిటీ చైర్మన్ హరిసింగ్‌నాయక్‌లు సైతం 23వ తేదీన సభ నిర్వహిస్తున్నారు. మున్సిపల్ పాలకవర్గం మూడేళ్ల పాలన పూర్తయిన సందర్భంగా పట్టణస్థాయిలో బీట్ మార్కెట్ కేంద్రంగా అదే రోజు ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేయడం చర్చనీయాంశంగా మారింది. రెండు సమ్మేళనాలు ఒకే తేదీన కావడంతో కేడర్‌ను కాపాడుకునేందుకే ఏర్పాటు చేసినట్లు స్పష్టమవుతోంది. కాగా, పట్టణంలోని బీట్ మార్కెట్‌లో జరిగే ఆత్మీయ సమ్మేళనం విజయవంతం చేయాలని ఎమ్మెల్యే, మార్కెట్ కమిటీ చైర్మన్, మున్సిపల్ చైర్మన్ ప్రజలకు పిలుపునిచ్చారు.

లలితాపురం తోటలో పొంగులేటి, కోరంల బృందం..

సోమవారం 10గంటలకు ఇల్లెందులోని లలితాపురం మామిడితోటలో జరుగు ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య కోరారు. ఆదివారం ఆయన తన అభిమానులతో కలిసి తోటలో జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. సమ్మేళనానికి నియోజకవర్గం నుంచి అభిమానులు అత్యధికంగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

జాతర ఏర్పాట్లపై సన్నాహక సమావేశం



వేలం పాట నిర్వహిస్తున్న దృశ్యం

నేలకొండపల్లి: మండలంలోని మోటాపురం గ్రామంలోని వీరన్నస్వామి జాతరకు సంబంధించిన ఏర్పాట్లపై ఆదివారం దేవాలయంలో కమిటీ సభ్యులు సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతరలో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చర్యలు చేపట్టాలని తీర్మానించారు. జాతర గురించి చుట్టు పక్కల ప్రాంతాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా దేవాలయంలో దుకాణం నిర్వహించేందుకు వేలం పాట నిర్వహించారు. రెండేళ్ల పాటు నిర్వహణకు గాను దుకాణాన్ని వేలంలో గ్రామానికి చెందిన కట్టా నాగేశ్వరరావు రూ.12.50 లక్షలకు సొంతం చేసుకున్నారు. సమావేశంలో సర్పంచ్ రాంబాయి, ఎక్సైజ్ సీఐ హనుమంతరావు, మమత వైద్యశాల సూపరింటెండెంట్ బాగం కిషన్‌రావు, కమిటీ ప్రతినిధులు కోటయ్య, గుడిమళ్ల మధు, ఇంటూరి శేఖర్, పుల్లయ్య పాల్గొన్నారు.

రైలుకింద పడి యువకుడి ఆత్మహత్య

మధిర: వ్యక్తిగత కారణాలతో మనస్తాపానికి గురై ఓ యువకుడు రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్న ఘటన మధిరలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మధిరలోని లడ‌ఖ్‌బజార్‌కు చెందిన మారు వెంకటేశ్వరరావు (20) ఆదివారం సాయంత్రం మధిర – మోటమర్రి స్టేషన్ల మధ్య కటక్ – సికింద్రాబాద్ స్పెషల్ రైలు కింద పడి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం మధిర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్యాయత్నం..

ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరం

జూలూరుపాడు: మండలంలోని కాకర్ల గ్రామానికి చెందిన ఓ యువకుడు ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మందనపు సురేష్ హమాలీ, వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం గ్రామం నుంచి గానుగపాడు వెళ్లే మార్గంలో ఉన్న మామిడి తోటకు వెళ్లి సురేష్ తన వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను ఒంటిపై పోసుకొని నిప్పంటించుకున్నాడు. దీంతో మంటల్లో చిక్కుకున్న సురేష్ కేకలు వేయడంతో అటుగా వెళ్తున్న ఓ వ్యక్తి గమనించి గ్రామస్తులకు సమాచారం అందించాడు. గ్రామస్తులు ఘటనా స్థలానికి చేరుకునే లోపే సురేష్ చర్మం, దుస్తులు కాలి తీవ్ర గాయాలతో రోడ్డుపైకి వచ్చాడు. వెంటనే స్థానికులు కొత్తగూడెంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. ప్రరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు చెప్పినట్లు సురేష్ కుటుంబసభ్యులు తెలిపారు. బాధితుడికి భార్య ఉన్నారు. అయితే సురేష్ గత కొంతకాలంగా క్రికెట్ బెట్టింగ్, కోడి పందేలు, పేకాట ఆడేందుకు అప్పులు చేసేవాడని, అప్పులు మరింతగా పెరగడంతో అప్పు ఇచ్చిన వారు సురేష్‌పై ఒత్తిడి తెస్తుండటంతో అతను ఈ ఘటనకు పాల్పడినట్లు స్థానికులు తెలిపారు.

'వందేభారత్' రైలుపై రాళ్లు

ఖమ్మంరూరల్: మండలంలోని రామన్నపేట వద్ద ఈ నెల 18న వందేభారత్ రైలుపై కొందరు ఆకతాయిలు రాళ్లు విసిరిన ఘటన ఆదివారం వెలుగుచూసింది. వివరాలిలా ఉన్నాయి. హైదరాబాద్ వైపు వెళ్తున్న వందే భారత్ రైలు రామన్నపేటకు వద్దకు రాగానే కొందరు ఆకతాయిలు రాళ్లు విసిరారు. రైలుపై రాళ్లు విసిరిన వారు కావాలనే చేశారా? లేక ఎలా జరిగింది? అనే విషయమై విచారణ చేస్తున్నట్లు ఆర్‌పీఎఫ్ సీఐ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ విషయమై రైలు పట్టాలను దాటకుండా, రైల్వే ఆస్తులను కాపాడడానికి కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు అధికారులు వివరించారు.

సజావుగా సాగింది..

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీఎస్‌పీఎస్సీ) ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఏఈఈ) పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు సంబంధించి ఖమ్మం నగరం, సమీపంలో 19 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా 77.94 హాజరుశాతం నమోదైంది. మధ్యాహ్నం పరీక్షకు 77.52 హాజరు శాతం నమోదైంది. నిమిషం నిబంధనను అధికార యంత్రాంగం పటిష్టంగా అమలు చేసింది. పలు పరీక్ష కేంద్రాలకు చివరి నిమిషాల్లో అభ్యర్థులు ఉరుకులు, పరుగుల మీద చేరుకున్నారు. కొద్ది మంది అభ్యర్థులు చంటి పిల్లలతో రాగా.. పలువురు గర్భిణులు సైతం పరీక్ష రాశారు. ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ గౌతమ్.. అదనపు కలెక్టర్ ఎన్.మధుసూదన్ సందర్శించారు.



అభ్యర్థుల హాల్‌టికెట్లు చూసి పరీక్ష కేంద్రంలోకి పంపిస్తున్న ఎన్‌సీసీ కేడెట్లు, పోలీసులు



సూచనలు ఇస్తున్న అదనపు కలెక్టర్ మధుసూదన్



పరీక్ష గదిలోకి వెళ్లేందుకు వివరాలు పరిశీలిస్తున్న దృశ్యం



సూర్యాపేట జిల్లా నుంచి చంటిబిడ్డతో పరీక్ష కేంద్రానికి వచ్చిన ఓ అభ్యర్థిని



స్నేహితులతో కలిసి పరీక్ష కేంద్రానికి వస్తున్న ఓ అభ్యర్థిని



చివరి నిమిషంలో పరుగులు పెడుతున్న ఓ అభ్యర్థి



పరీక్షా కేంద్రం పోలీస్ బందోబస్తు నిర్వహిస్తున్న దృశ్యం